ప్రపంచ శాంతిని కోరుతూ..



ప్రపంచ శాంతి కోసం బర్కత్‌పురలో ర్యాలీ ప్రారంభించిన రెడ్డి ఉమెన్స్ కాలేజీ విద్యార్థులు

కాచిగూడ: శాంతి ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ అన్నారు. ప్రపంచ శాంతిని కోరుతూ తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో బుధవారం బర్కత్‌పురలోని రాజా బహదూర్ వెంకట్రామరెడ్డి మహిళా కళాశాల నుంచి అబిడ్స్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. శాంతి, జాతీయ సమైక్యత, మత సామరస్యానికి ప్రతీక అయిన హైదరాబాద్ మహానగరం మనందరికీ ఆదర్శమని అన్నారు.

◆ విద్యార్థులు, యువత శాంతి మార్గంలో పయనించి దేశ సమైక్యత, అభివృద్ధికి పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.విజయలక్ష్మి, నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ అధ్యక్షుడు బత్తుల హేమంత్, హైకోర్టు న్యాయవాది గద్దగూటి ఎట్టయ్య, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

అంబర్‌పేట: నియోజకవర్గంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. నియోజకవర్గంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ కోసం మంజూరైన కొత్త చెత్త సేకరణ రిక్షాలను బాగ్ అంబర్‌పేట డివిజన్లో బుధవారం కార్పొరేటర్‌లు బి.పద్మా వెంకట్‌రెడ్డి, విజయకుమార్‌గౌడ్, డీఎంసీ మారుతీ దివాకర్, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమాలతతో కలిసి పారిశుద్ధ్య కార్మికులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.



బాగ్ అంబర్‌పేటలో రిక్షాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు , కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

గోల్నాక డివిజన్‌లో..

గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం డివిజన్‌లో డివిజన్‌కు మంజూరైన నూతన చెత్త సేకరణ రిక్షాలను పారిశుద్ధ్య కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతోందన్నారు. ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ ఆటోలకు తడి, పొడి చెత్తను అందించి సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ అన్నారు. బుధవారం కాచిగూడ డివిజన్ పరిధిలో చెత్త సేకరించే జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు చెత్త సేకరణ రిక్షాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటింటికీ వచ్చే చెత్త సేకరణ సిబ్బందికి మాత్రమే చెత్తను అందివ్వాలన్నారు. చెత్తను రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పడేయొద్దని సూచించారు. రోడ్లపై పేరుకు పోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని జీహెచ్‌ఎంసీ సిబ్బందిని ఆమె ఆదేశించారు. ఎస్‌ఎస్ తిరుపతి నాయక్, ఎస్‌ఎఫ్‌ఏలు అమరేశ్వరి, విష్ణు, రామారావు, దేవా, చంద్రశేఖర్, బీజేపీ నేతలు పాల్గొన్నారు.



చెత్త సేకరణ రిక్షాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా



గోల్నాకలో చెత్త సేకరణ రిక్షాలను అందజేస్తున్న కార్పొరేటర్ లావణ్య

26న బీసీల చలో ఢిల్లీ

కాచిగూడ: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి, చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఈనెల 26వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ జనగణనలో కులగణన చేపట్టాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్ర బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి రూ.2లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వేలాది మంది బీసీలు పాల్గొని చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు నంద గోపాల్, ఉదయ్ నేత, నాల వెంకటేష్, వేముల రామకృష్ణ, రఘుపతి, మోదీ రాందేవ్, నిఖిల్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టడం హర్షణీయం



టీపీసీసీ అధ్యక్షుడికి అభినందనలు తెలుపుతున్న కృష్ణగౌడ్

అంబర్‌పేట: రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టడం సామాజిక న్యాయానికి దోహదపడుతుందని ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని అన్నారు. ఈ సందర్భంగా బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి శాలువతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లేబర్ బోర్డు వైస్‌చైర్మన్ నాగభూషణం, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, చందుపటేల్, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



ఆశా కార్యకర్తలను సన్మానిస్తున్న రామలింగేశ్వరరావు

నల్లకుంట: యూపీహెచ్‌సీల్లో ఆరోగ్య కార్యకర్తల సేవలే కీలకమని స్వామి వివేకానంద కేంద్రం ప్రతినిధి రామలింగేశ్వరరావు అన్నారు. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించిన సమయంలో ఆయిన వాళ్లే రోగి వద్దకు వెళ్లాలంటే భయపడిన సమయంలో ఆశా కార్యకర్తలు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్మికులను సత్కరించుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని అన్నారు. ఈ మేరకు స్వామి వివేకానంద కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రామాలయం ప్రాంగణంలో యూపీహెచ్‌సీ, పారిశుద్ధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా గోదావరి ఆశా కార్యకర్తలను శాలువాతో సన్మానించి, వివేకానంద బోధనలు పుస్తకాన్ని అందజేసిన రామలింగేశ్వరరావు మాట్లాడారు. ప్రజల ఆరోగ్య పరిస్థితిని సర్వే చేసి సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించడంలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషిస్తారన్నారు. అలాంటి ఆశా కార్యకర్తలను గౌరవించడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్. హరినాథ్‌రెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డి, భూదాన్ సాగర్ రెడ్డి, వివేకానంద కేంద్రం ప్రతినిధులు వినయ్‌కుమార్, లక్ష్మి నారాయణ, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి



బాణసంచా దుకాణదారుల సమావేశంలో మాట్లాడుతున్న ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి

అంబర్‌పేట: బాణాసంచా దుకాణదారులు నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాలు చేసుకోవాలని ఈస్ట్ డీసీపీ బాలస్వామి సూచించారు. బుధవారం ఛే నంబర్ చౌరస్తాలో ఓ ఫంక్షన్‌హాల్‌లో బాణాసంచా దుకాణదారులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పలు సలహాలు, సూచనలు చేశారు. వచ్చే దీపావళి పండుగను పురస్కరించుకొని బాణసంచా విక్రయాలను పలు జగ్రత్తాలు తీసుకోని విక్రయించుకోవాలని సూచించారు. నిబంధనలను విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి తీసుకోవాల్సిన అనుమతులను ముందస్తుగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిషినల్ డీసీపీ జె.నర్సయ్య, ఏసీపీలు రఘు, జగన్, ఇన్‌స్పెక్టర్ ఆశోక్‌లతో ఇతర అధికారులు, బాణసంచా దుకాణాదారులు ఉన్నారు.

ఓయూలో పీడీఎస్‌యూ ఆవిర్భావ సభ నేడు

ముషీరాబాద్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఆవిర్భవించి 50 ఏళ్లు గడుస్తున్న సందర్భంగా గురువారం ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల 24వ తేదీన భారీ సభను నిర్వహిస్తున్నట్లు రెండు పీడీఎస్‌యూ సంస్థల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.మహేష్, బోనగిరి మధు, ఎస్వీ శ్రీకాంత్, పోడపంగి నాగరాజు తెలిపారు. సంఘం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందన్నారు. ఉస్మానియా అరుణతార కామ్రేడ్ జార్జి రెడ్డి, జేసీఎస్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలాశంకర్, రంగవల్లి లాంటి అమరవీరుల నెత్తుటి తర్పణతో పీడీఎస్‌యూ ఏర్పడిందన్నారు.

◆ కేవలం విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం మాత్రమే పరిమితం అవ్వకుండా దేశంలో సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, కుల, మత అంతరాలు తొలగి సమ సమాజం ఏర్పడడం కోసం పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందన్నారు. పీడీఎస్‌యూ చేసిన పోరాటాలతో అనేకమైన హక్కులు విద్యార్థులు సాధించుకున్నారన్నారు. ఈ సభకు ప్రధాన వక్తగా గౌహర్ రాజా సైంటిస్ట్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మినారాయణ, ప్రముఖ రచయిత్రీ కాత్యాయని, పీడీఎస్‌యూ పూర్వ అధ్యక్షులు బి.ప్రదీప్, ఎస్.వెంకటేశ్వరరావు, పి.ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ కాసీం, ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్, ప్రొఫెసర్ సమన్వత తదితరులు హాజరవుతారని తెలిపారు.

అత్యధిక సభ్యత్వాలు చేసి... అందరి మన్ననలు పొంది.!

కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిన ఉషాశ్రీకాంత్‌గౌడ్



ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న శంభుల ఉషాశ్రీకాంత్‌గౌడ్

అంబర్‌పేట: కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదులో పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభూల ఉషాశ్రీకాంత్‌గౌడ్ జాతీయ స్థాయిలో మూడోస్థానంలో నిలిచి పార్టీ అధిష్టానంతో శభాష్ అనిపించుకున్నారు. రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచి అందరి మన్ననలు పొందుతున్నారు. బుధవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మహిళ విభాగం జాతీయ అధ్యక్షురాలు అల్కా లంబా, రెజ్లర్ వినేష్‌ఫోగాట్ మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఉషా శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ... పార్టీ అప్పగించే బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు, నాయకులు కృష్ణవేణి, నిర్మలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి సమస్యను పరిష్కరించండి



అరుంధతినగర్‌లో అధికారులతో మాట్లాడుతన్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: వరదనీటి సమస్యను పరిష్కరించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని కోరారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం డివిజన్‌లోని అరుంధతినగర్‌లో జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్, డీఏ గీత, ఏఈ, అబ్దుల్ సలాంలతో కలసి ఆమె అరుంధతినగర్, అశోక్‌నగర్ లలో పర్యటించారు. కొన్నేళ్లుగా ప్రజలు సమస్యను ఎదుర్కొంటున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్, నేతలు ఎం.ఉమేష్, ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్, వైస్ చైర్మన్‌కు సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొ.పురుషోత్తంను ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చాలు అందజేసి అందచేసి, శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఉన్నత విద్యను పరిశ్రమలతో అనుసంధానం చేయాలని వారిని ఆయన కోరారు.

ఓయూ వీసీకి వినూత్న కానుక అందజేత

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొ.కుమార్‌కు యూనివర్సిటీ క్యాంపస్ టెక్నాలజీ కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్.సాదం ఐలయ్యయాదవ్ వినూత్న కానుకను అందజేశారు. వీసీ విద్యాభాస్యం మొదలు ఉద్యోగం, బోధన, పరిశోధన, చేపట్టిన పదవులు, అవార్డులు తదితర అనేక అంశాలను ప్రస్తావిస్తూ ఇద్దరి ఫొటోలతో ఫ్రేం కట్టించి ప్రొ.కుమార్‌కు అందించి అభినందనలు తెలిపారు.

ఓయూ వీసీకి వినతుల వెల్లువ..

ఓయూ వీసీ ప్రొ.కుమార్‌కు అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం వినతులు వెల్లువెత్తుతున్నాయి. అధికారులతో పాటు విద్యార్థి సంఘాల నేతలు, అధ్యాపకులు, ఉద్యోగులు అభినందనలు, సన్మానాలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. దీంతోపాటు వివిధ సమస్యలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేస్తున్నారు.

నాటక రంగాన్ని కాపాడుకుందాం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవి అండ్ రవి ఆర్ట్స్ అసోసియేషన్ 66వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహమేరా జీవితం, శివ సంకల్పమస్తు పుస్తకాలను ఆవిష్కరించగా సుప్రభాతం, ప్రేమకు పరాకాష్ట నాటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. నాటకరంగ దర్శకుడు మాడుగుల వెంకట కృష్ణమోహన్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాలలో నాటకాలను ప్రదర్శించడం ఎంతో అభినందనీయమన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి

సుల్తాన్‌బజార్: తెలంగాణలోని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలను విడుదల చేయాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్ ద్వారా క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ జరిగేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. అలాగే చాలా కాలంగా ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న బిల్స్ క్లీయర్ చేసి పీఆర్సీని త్వరగా ప్రకటించాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని జీఓ నెంబర్ 317 ద్వారా ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని లేని పక్షంలో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

ఆరోగ్య బీమాపై అవగాహన పెంచుకోవాలి



ఆరోగ్య బీమా బ్రోచర్ ఆవిష్కరిస్తున్న భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ ప్రతినిధులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆరోగ్య బీమాపై రిటైర్డ్ ఉద్యోగులు అవగాహన పెంచుకోవాలని భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ అసోసియేషన్ అధ్యక్షుడు టీవీఎస్ ప్రసాద్ సూచించారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వారు ఆరోగ్య బీమాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ... రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య బీమాతో పాటు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఆరోగ్య బీమా ఉంటే కొంత కాలం పాటు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య బీమాకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, రామడుగు లక్ష్మణ్‌రావు, కేఎం దస్తూరు, ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుధాకర్, కార్యదర్శి కృష్ణమూర్తి, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో చెత్తాచెదారం వేయొద్దు



బాకారంలో డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ రవిచారి

ముషీరాబాద్: డ్రైనేజీల్లో చెత్తాచెదారాలు, వ్యర్థాలను వేయవద్దని రాంనగర్ కార్పొరేటర్ రవిచారి సూచించారు. బుధవారం డివిజన్ పరిధిలోని బాకారంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యపై డీజీఎం మోహన్‌రావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎయిర్‌టెక్ మెషిన్‌ను తెప్పించి డ్రైనేజీలను శుభ్రం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... చాలా ప్రాంతాల్లో డ్రైనేజీల్లో మట్టి పేరుకుపోతుందని పేర్కొన్నారు. అలాగే కొంత మంది డ్రైనేజీల్లో చెత్తను వేయడంతో పాటు వ్యర్థాలను వేస్తున్నారని అన్నారు. దీంతో డ్రైనేజీలు పొంగిపొర్లుతాయని అన్నారు. ఇది స్థానిక ప్రజలకే ఎంతో ఇబ్బందికరంగా మారుతుందన్నారు. ప్రజలు సైతం బాధ్యతతో వహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సతేందర్, శివ, యాదగిరి, యాదవ్ తదితరులున్నారు.

సత్తాచాటిన 'అంబేడ్కర్' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న అంబేడ్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ జి.రోజావివేక్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఉస్మానియా యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన తైక్వాండో టోర్నమెంట్‌లో అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఎస్.సతీష్‌కుమార్ అండర్ 80కేజీ కేటగిరిలో గోల్డ్ మెడల్, బి.గౌరీ 54కేజీల కేటగిరిలో సిల్వర్ మెడల్, ప్రణయ్ 80కేజీల విభాగంలో సిల్వర్ మెడల్, ఏ.పురుషోత్తం 58 కేజీల విభాగంలో బ్రౌన్స్ మెడల్, ఓవర్ ఆల్ చాంపియన్ షిప్‌లో కళాశాలకు ద్వితీయ స్థానం లభించింది. ఇంటర్ కాలేజీ కబడ్డీ మెన్స్ చాంపియన్‌షిప్‌లో కూడా అంబేడ్కర్ విద్యార్థులకు మంచి గుర్తింపు వచ్చింది. ఈ సందర్భంగా అంబేడ్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ జి. సరోజ వివేక్, ప్రిన్సిపాల్ మాట్లా శేఖర్ కళాశాల విద్యార్థులను అభినందించారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం



వరలక్ష్మి, నాగేశ్వరశర్మకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తున్న బాలరాజ్‌గౌడ్, కృష్ణారావు

చిక్కడపల్లి: మానస ఆర్ట్స్ థియేటర్స్ త్యాగరాయ గానసభల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గుండవరపు హనుమంతరావు వేదికలో ప్రముఖ కవి ఉమ్మడిసింగు కృష్ణారావు బహుభాషా కవి సమ్మేళనం నిర్వహించారు. కవులు, కవయిత్రులు పాల్గొని తమ స్వీయ కవితలకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల నుంచి ఎంపిక చేసిన పలువురు ప్రముఖులకు ప్రతిభా పురస్కారాలను ఆదర్శ కిరణం మాసపత్రిక సంపాదకులు వంగల బాలరాజ్‌గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు కపిల వరలక్ష్మి, పీసపాటు నాగేశ్వరశర్మ, రాధాకుసుమ, కోక భవాని విజయకుమార్, రామచంద్రరావు, లలితావాణి, కవి రఘుశ్రీ పాల్గొన్నారు.

ముగిసిన కోదాటి శత జయంతి ఉత్సవాలు



నాంపల్లి: తెలంగాణ తొలి మాండలిక నాటక రచయిత కోదాటి లక్ష్మీ నరసింహారావు శత జయంతి ఉత్సవాలు ముగిశాయి. ఈ ఉత్సవాలు తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య ఆధ్వర్యంలో తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగాయి. ముగింపు సందర్భంగా రెండవ రోజు కళానికేతన్ హైదరాబాద్ సమర్పణలో లక్ష్మీ నరసింహారావు రచించిన డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వంలో ప్రదర్శించిన స్వార్థం నాటిక ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ డీజీపీ హెచ్.జె.దొర హాజరయ్యారు. అనంతరం నాటికలోని కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు తడకమళ్ల రాంచందరరావు, ప్రధాన కార్యదర్శి సాధు శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలి



అమ్మవారికి పూజలు చేస్తున్న రంగరాజన్

రాంగోపాల్‌పేట్: హిందూ దేవాలయాలు, దేవుళ్లపై దాడులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు విధించేలా చట్టాలను సవరించాలని చిలూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు రంగ రాజన్ అన్నారు. బుధవారం ఆయన కుమ్మరిగూడ ముత్యాలమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ అమ్మవారిపై దుండగుడి చేసిన దాడి అమానుషమన్నారు. భయం, భక్తి లేనందునే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్న సమయంలో పోలీసులు ఐపీసీ 295 కింద కేసు నమోదు చేస్తారని దాని కింద రెండేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా ఉంటుందన్నారు. పంజాబ్‌లో ఈ చట్టాన్ని సవరించారని అలాగే ఇలాంటి నేరాలకు పాల్పడే వారికి ఉరిశిక్ష విధించేలా చట్టం చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

ఏకసభ్య కమిషన్‌ను ఉపసంహరించుకోవాలి

లిబర్టీ: తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అంశంపై ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్‌ను ఉపసంహరించుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, డాక్టర్ ప్రొఫెసర్ వీఎల్.రాజు డిమాండ్ చేశారు. మాల మహానాడు కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయడం చెల్లదని రాజ్యాంగంలో స్పష్టం చేసిన పాలకులకు తెలియదా అని ప్రశ్నించారు. తాము వర్గీకరణను అంగీకరించమని ఏబీసీడీలుగా వర్గీకరణ చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీ కృష్ణస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే మెరుగైన సౌకర్యాలు

లిబర్టీ: కాంగ్రెస్ హయాంలోనే మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సందానంద అన్నారు. మాల మహానాడు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే అనేక సంక్షేమ పథకాలు, ఉద్యోగాల కల్పన విద్య, వైద్య రంగాన్ని బలోపేతం చేయడం, ప్రాజెక్టులపై దృష్టిసారించడం నీళ్ల మీద నియామకాలు ప్రత్యేక దృష్టిసారించడం వల్ల ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంతో పాటు మరో 14 అంశాలపై దృష్టిసారించి పని చేస్తుందని తెలిపారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలులో ప్రయాణికుడి బ్యాగ్ చోరీ

కాచిగూడ: రైలులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి బ్యాగ్ చోరీకి గురైన సంఘటనలో కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం ... నాంపల్లి ప్రాంతానికి చెందిన రతిలాల్ జైన్ (53) కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 5వ తేదీన జోద్‌పూర్ వెళ్లడానికి కాచిగూడ రైల్వే స్టేషన్‌లో లాల్‌ఘర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరి వెళ్లారు. నాందేడ్ సమీపంలో మోత్కెడ్ వద్ద చూసుకునే సరికి తన బ్యాగ్ కనిపించకుండా పోయింది. బ్యాగ్‌లో 6 గ్రాముల బంగారు రెండు రిగులు, రూ.50వేల నగదు, రెండు ఫోన్లు ఉన్నాయి. జోద్‌పూర్ వెళ్లి అక్కడ పర్యటించి తిరిగి నగరానికి ఈనెల 18వ తేదీన చేరుకున్నారు. సెల్‌ఫోన్‌లో సిమ్‌ను వేసుకుని చూసుకోగా ఫోన్‌పే ద్వారా రూ.68వేలు విత్ డ్రా అయ్యింది. దీంతో రతిలాల్ జైన్ బుధవారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కేసును నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

వైద్యురాలితో యువకుడి అసభ్య ప్రవర్తన

వెంగళరావునగర్: వాకింగ్‌కు వచ్చిన వైద్యురాలిపై వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళరావునగర్‌కాలనీలో మహిళా వైద్యురాలు నివాసం ఉంటుంది. మంగళవారం రాత్రి తన పెంపుడు కుక్కను తీసుకుని వాకింగ్‌కు వచ్చింది. అదే సమయంలో బైక్‌పై వెనుక నుంచి వచ్చిన యువకుడు వైద్యురాలి ప్రైవేట్ భాగాలను బలంగా తాకాడు. అంతేగాకుండా అసభ్య పదజాలంతో దూషించాడు. ఖంగుతిన్న వైద్యురాలు యువకుడిని చూసి ఆపేందుకు ప్రయత్నించగా వేగంగా పారిపోయాడు. బైక్ నెంబర్ ప్లేట్‌ను గమనించింది. మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.